క్లుప్తంగా

కర్నూలు ఏపీఓగా మధుబాబు



కర్నూలు (న్యూటౌన్): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కర్నూలు మండల ఏపీఓగా పి మధుబాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కర్నూలు మండల ఇంజినీర్ మనోహర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు స్వాగతం పలికారు. జిల్లా డ్వామా పీడీ కార్యాలయంలో పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఏపీఓ మహమ్మద్ బాషా గోనెగండ్ల మండల ఏపీఓగా బదిలీపై వెళ్లారు.

పాలిసెట్‌లో 168వ ర్యాంకు



పి.కీర్తి ప్రియాంక

కల్లూరు: శనివారం సాయంత్రం విడుదలయిన పాలిసెట్ ఫలితాల్లో కల్లూరు అర్బన్ అబ్బాస్‌నగర్‌కు చెందిన విద్యార్థిని పి.కీర్తి ప్రియాంక 115 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 168 ర్యాంకు సాధించింది. తండ్రి రామకృష్ణ ఇది వరకే మరణించగా, తల్లి సరోజ ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. సివిల్స్ సాధించి పేద ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని కీర్తి ప్రియాంక తెలిపారు.

గూడూరు విద్యార్థినికి సీఎం ప్రోత్సాహక బహుమతి



విద్యార్థిని మౌనికను అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు

గూడూరు: గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదివిన విద్యార్థిని టి.మౌనిక నియోజకవర్గ స్థాయిలో సీఎం ప్రోత్సాహక నగదు బహుమతికి ఎంపికైనట్లు శనివారం కళాశాల ప్రిన్సిపాల్ వై.అజయ్ కుమార్ తెలిపారు. కళాశాలలో సెకండ్ ఇయర్ హెచ్‌ఈసీ గ్రూప్‌లో మౌనిక 869 మార్కులు సాధించి నియోజకవర్గంలోనే ప్రథమ స్థానంలో నిలించింది. మౌనికను కళాశాల అధ్యాపకులు అభినందించి బహుమతిని అందించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 29వ వార్డుకు ప్రథమస్థానం



అవార్డు అందుకుంటున్న కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి

కల్లూరు : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా వార్డులోని కాలనీలోని పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నందుకు కార్పొరేషన్‌లోని 29వ వార్డు ప్రథమ స్థానంలో నిలిచింది. శనివారం 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డిని నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్, కమిషనర్ భార్గవ్‌తేజ, ఇతర మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. అవార్డు దక్కించుకున్నందుకు అదనంగా రూ. 30లక్షలతో వార్డులో వివిధ అభివృద్ధి పనులు చేసుకోవచ్చు.

వరిగడ్డి దగ్ధం

కోడుమూరు : ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తాకి ట్రాక్టర్‌పై తరలిస్తున్న వరిగడ్డి దగ్ధమైన ఘటన మండలంలోని కొత్తపల్లె గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కొత్తపల్లె గ్రామానికి చెందిన రైతు రాముడు పశువుల మేత కోసం పొలం నుంచి వరిగడ్డిని ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తాకి నిప్పురవ్వలు గడ్డిపై పడి నిప్పంటుకుంది. ప్రమాదాన్ని గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి ట్రాలీ లిఫ్ట్ ఎత్తి గడ్డిని కిందకు పారవేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న కోడుమూరు అగ్నిమాపక సిబ్బంది గ్రామాన్ని చేరుకుని మంటలను అదుపుచేశారు.

ధర్నాకు తరలిరావాలి

కర్నూలు (న్యూటౌన్): ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవడానికి ఈ నెల 22న కలెక్టరేట్ వద్ద చేపట్టబోయే ధర్నాకు తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు, సీపీఐ మండల ఉపాధ్యక్షులు ఉసేనయ్య పిలుపునిచ్చారు. శనివారం కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం బృందం సభ్యులు ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వేధింపుల కేసు నమోదు

గడివేముల: మండల కేంద్రమైన గడివేముల గ్రామానికి చెందిన సానికొమ్ము శ్రావణి ఫిర్యాదు మేరకు ఆమె భర్తతో పాటు అత్త, ఆడపడుచులపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..శ్రావణికి శిరివెళ్ల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సుబ్బారెడ్డితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. కాగా కొన్ని నెలల నుంచి అదనపు కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు భర్తతో పాటు అత్త రత్నమ్మ, ఆడపడుచులు లక్ష్మిదేవి, రమాదేవిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- తిరుపాడులో 'గడప గడపకు మనప్రభుత్వం'
- సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు



వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: తాతా బాగున్నావా..అవ్వ సకాలంలో పింఛన్ అందుతోందా..అక్క, తమ్ముడు, అమ్మా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అంటూ వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తిరుపాడు గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. మండల పరిధిలోని తిరుపాడు గ్రామంలో శనివారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కొన్ని ఏళ్ల నుంచి రోడ్లు, డ్రైనేజీలు, ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయలేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో, సచివాలయ ఉద్యోగులతో మాట్లాడి అర్హత ఉంటే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న 95 శాతం హామీలను నెరవేర్చిందని ఎమ్మెల్యే అన్నారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అర్హత ఉంటే ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, సర్పంచ్ బాలలింగమ్మ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, సర్పంచ్‌లు నాగేశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివరామిరెడ్డి, వెంకటక్రిష్టారెడ్డి, ఎల్లారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల చుట్టు తిప్పుకోవద్దు

గ్రామాల్లో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు, రైతులు, విద్యార్థులను కార్యాలయాల చుట్టు తిప్పుకోవద్దని ఎమ్మెల్యే కాటసాని సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామాల్లో తాగునీటి నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మండలానికి జలజీవన్ మిషన్ కింద రూ.రెండు కోట్లు పనులు జరుగుతున్నాయన్నారు. ఖరీఫ్ సీజన్‌లో నకిలీ విత్తనాలు, లూజు విత్తనాలు రైతులు కొనుగోలు చేయరాదని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం కుల, పార్టీలకు అతీతంగా అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఎంతటి వారినైనా సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఏఓ హేమసుందర్‌రెడ్డి, ఎంఈఓ రామక్రిష్ణుడు, వైద్యాధికారిణి జబీన్, ఏపీఎం వెంకటరమణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

చర్చి పునఃప్రారంభం

పాణ్యం: మండల పరిధిలోని రసూల్లాపెట గ్రామంలో పునఃనిర్మించిన 'పునీతా జోజప్ప గారి దేవాలయం' (చర్చి)ని శుక్రవారం ప్రారంభించారు. వేడుకలకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై ప్రార్థనలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మేత్రసన పాలానాధికారి ఫాదర్ అంథోనప్ప, చొరప్పల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. చర్చి నిర్వహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, బాలస్వామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు



20వ వార్డులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు : రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని, పార్టీలకు అతీతంగా పథకాలను అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం కల్లూరు అర్బన్ 20 వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకుసాగారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ క్యాలెండర్లను పంపిణీ చేస్తూ ప్రభుత్వం నుంచి వారు పొందిన సంక్షేమ పథకాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామిలలో 98శాతం అమలు చేశామన్నారు. పేద ప్రజల అభ్యున్నతి ధ్యేయంగా జనరంజక పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా పట్టంకటాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, శ్వేతారెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, రంగారెడ్డి, భీమశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల విక్రయదారుల నుంచి కాపాడాలి

కోడుమూరు రూరల్ : నకిలీ పత్తి విత్తనాల విక్రయదారుల నుంచి రైతులను కాపాడాలని సీపీఐ మండల కార్యదర్శి రాజు వ్యవసాయాధికారులను కోరారు. గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం సీపీఐ నాయకులు, రైతులు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రాజు మాట్లాడుతూ నకిలీ పత్తి విత్తనాల సాగుతో గతేదాది చాలామంది రైతులు జిల్లాలో తీవ్రంగా నష్టపోయారని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రాముడు, రైతు సంఘం నాయకులు బజారి, అయ్యన్న, నడిపన్న, జమ్ములయ్య తదితరులున్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గడివేముల: ఏపీ మోడల్ స్కూల్లో ఇంటర్ మీడియెట్ ఫస్టియర్ చేరేందుకు తరగతుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు రూరల్ : జూలకల్ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శనివారం ప్రిన్సిపల్ దిల్షాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని, ఇంగ్లిష్ మీడియంలోనే బోధన ఉంటుందన్నారు.

లబ్ధిదారుల ఇళ్లవద్దకే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- ముడుమాలలో 'గడప గడపకు మనప్రభుత్వం'



వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: లబ్ధిదారుల ఇళ్ల వద్దకేకే సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శనివారం శనివారం మండలంలోని ముడుమాల గ్రామ పంచాయతీ పరిధిలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయాన్నే గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు, స్థానిక నాయకుల నుంచి ఘన స్వాగతం లభించింది. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి తిరుగుతూ నాలుగు సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, ఆయా ఇళ్లకు చేకూరిన లబ్ధిని వివరించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను అధికారులతో నమోదు చేయించి, వాటిని వీలైంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామంలో కొంతమంది పింఛన్ సమస్యలు, సీసీ రోడ్లు, మురుగు కాలువల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. గ్రామస్తుల సమస్యలపై స్పందించిన ఆయన గ్రామాలలో సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాముడును ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంతల మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీడీఓ రాముడు, తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనే నాయక్, వైస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వరరెడ్డి, మద్దిలేటి, హనుమంతు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై నిఘా పెంచండి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో నకిలీ విత్తనాలపై నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన వ్యవసాయ యంత్రాంగాన్ని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... రైతుభరోసా కేంద్రంలో నాన్ సబ్సిడీ విత్తనాలు కూడా పంపిణీ చేయాలని సూచించారు. ప్రధానంగా బీటీ పత్తి విత్తన ప్యాకెట్లను ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందజేయాలని, ప్రభుత్వం ఏఏ కంపెనీలతో ఒప్పందం చేసుకుందో.. ఆ కంపెనీల వివరాలను ఆర్‌బీకేల్లో డిస్‌ప్లే చేయాలని సూచించారు. నకిలీలకు తావు లేకుండా ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని, నకిలీ విత్తనాల విక్రేతపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ... పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయాన్ని రైతుల్లోకి తీసుకెళ్లడంలో వ్యవసాయ శాఖ విఫలమవుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున చేపట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కల్లూరు మండలం ఉల్లిందకొండ చెరువులో చేపల పెంపకం చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి పాల్గొన్నారు.

రూ.272 వేతనం పడేలా పనులు కల్పించాలి



మాట్లాడుతున్న డ్వామా ఏపీడీ లక్ష్మన్న

కర్నూలు (న్యూటౌన్): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు దినసరి వేతనం కనీసం రూ.272 పడేలా పనులు కల్పించాలని డ్వామా ఏపీడీ లక్ష్మన్న మండల అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జెడ్పీలోని కర్నూలు మండల ఉపాధి హామీ పథకం కార్యాలయంలో మండల ఇంజినీర్ మనోహర్‌రెడ్డి, ఏపీఓ మధుబాబు, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసలు నివారించి ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. రాబోయే వర్షాకాలంలో ఉద్యాన పంటలు తక్కువ పెట్టుబడితో అధికలాభాలు పొందే చీనీ, మామిడి, నిమ్మ, జామ, చింత, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్, గుండు మల్లెలు, గులాబీ పూల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 100 శాతం సబ్సిడీతో తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. మండల పరిధిలోని 52 మిని గోకులాలు ఉన్నాయని, పశుసంవర్థకశాఖ వారి సహకారంతో వాటికి పేమెంట్ చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, త్వరలోనే రైతుల ఖాతాలో నగదు జమ అవుతాయన్నారు.

కొలతలకు తగ్గట్టు పని చేయాలి

పాణ్యం : ఉపాధి పనుల్లో భాగంగా కూలీలకు ఇచ్చిన కొలతల ఆధారంగా పనులు చేయాలని ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంపీడీఓ దస్తగిరి అన్నారు. శనివారం పాణ్యంలోని పలు ప్రదేశాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున కూలీలు ఉదయం 6.30గంటలకు పనుల వద్ద ఉండాలన్నారు. కార్యక్రమంలో టీఏ రజాక్, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- వలంటీర్లకు వజ్ర, రత్న, మిత్ర అవార్డులతో సత్కారం

గూడూరు: వలంటీర్ల సేవలు ఎనలేనివని ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా వారు పని చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, ఎంపీడీఓ మాధవీలత అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ మౌలాలి, మున్సిపల్ చైర్మన్ జులపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవా దృక్పథంతో పని చేస్తున్న వలంటీర్లకు హ్యాట్సాఫ్ చెప్పవచ్చన్నారు. వీరి సేవలకు తగ్గ ప్రతి ఫలం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తారని భరోసా ఇచ్చాడు. పేద ప్రజల దీవెనలు వారికి ఉంటాయన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు పేదలకు అందాలంటే దళారుల చుట్టూ వారు తిరిగేవారని, జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఎవరి ప్రమేయం లేకుండా ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు వలంటీర్ల ద్వారా అందుతున్నాయని చెప్పారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



గుడిపాడు వలంటీరు మధుకు సేవా వజ్ర అవార్డుతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, తదితరులు



సేవా రత్న, మిత్ర అవార్డులతో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

గుడిపాడు వలంటీర్‌కు సేవ వజ్ర అవార్డు

మండలంలోని గుడిపాడు గ్రామ వలంటీర్ మధు సేవా వజ్ర అవార్డుకు ఎంపికైనట్లు ఎంపీడీఓ మాధవీలత తెలిపారు. మధుకు రూ.30 వేలు నగదు, ప్రశంశా పత్రాన్ని ఎమ్మెల్యే చేతులమీదుగా అందించారు. అలాగే సేవా రత్న అవార్డుకు ఎంపికైన వలంటీర్లకు రూ.20 వేలు, సేవా మిత్రకు ఎంపికైన వలంటీర్లకు రూ.10 వేలు నగదు, ప్రశంశా పత్రాన్ని ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధులు అందించారు. వైస్ ఎంపీపీ కే.నాగులాపురం రాజమ్మ, నరసింహారెడ్డి, సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మెప్మా మార్కెట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

పట్టణంలో పాత బస్టాండ్ సెంటర్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మార్కెట్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ సందర్శించారు. పొదుపు మహిళలు సొంతంగా వేసిన వస్తువులు, ఎంబ్రాయిడింగ్ వర్క్ చీరలు, ఫినాయిల్ తదితర వస్తువులను తిలకించి మహిళలను అభినందించారు. మున్సిపల్ కమిషర్ ప్రసాద్‌గౌడ్, మెప్మా సీఎంఓ సూర్యనారాయణ, ఆర్పీలు మద్దమ్మ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గాలీవాన బీభత్సం



మద్దూరు-కొత్తూరు మధ్యలో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు

పాణ్యం : మండలంలో గాలీవాన బీభత్సం సృష్టించింది. శనివారం సాయంత్రం దాదాపు 2 గంటల పాటు ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో వర్షం కురిసింది. దీంతో మండల పరిధిలోని మద్దూరు-కొత్తూరు గ్రామాల మధ్య చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. వాహనాలు గంట సేపు నిలిచిపోయాయి. పాణ్యం, ఆలమూరు గ్రామాల్లో విద్యుత్ స్థంభాలు విరిగి పడటంతో సరఫరా నిలిచిపోయింది. అనుపూరు గ్రామ సమీపంలో కొర్ర వాగుకు వరద నీరు వచ్చి చేరింది. పాణ్యంలోని జుర్రాగు, బలపనూరు కానుగల వాగుకు, స్వల్పంగా వరదనీరు చేరింది. గత మూడు రోజుల నుంచి ఎండల తీవ్రతకు అల్లాడిపోయిన ప్రజలకు ఈ వర్షంతో వాతవరణం కాస్త చల్లడి ఉపశమనం కలిగించింది.

గడివేముల: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద వేపచెట్టు, బిలకలగూడూరు రస్తాలో మరో వేపచెట్లు నేలకూలాయి. చెట్లు విరిగిపడి విద్యుత్ స్థంభాలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోడంతో భారీ ప్రమాదం తప్పింది.

22 నుంచి 'వలంటీర్లకు వందనం'

కోడుమూరు రూరల్: ఈనెల 22, 23, 26వ తేదీల్లో మండలంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ శనివారం తెలిపారు. 22న కోడుమూరు బాలుర హైస్కూల్లో కోడుమూరు, ప్యాలకుర్తి, వెంకటగిరి, ముడుమలగుర్తి గ్రామ సచివాలయాల వలంటీర్లను సత్కరించడం జరుగుతుందన్నారు. అలాగే 23న కల్లపరి ప్రాథమిక పాఠశాలలో కల్లపరి, వర్కూరు, పులకుర్తి, 26న గోరంట్ల హైస్కూల్లో గోరంట్ల, అమడగుంట్ల, అనుగొండ, ఎర్రదొడ్డి, లద్దగిరి గ్రామ సచివాలయాల వలంటీర్ల సత్కార కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

తెలుగు పద్య గేయ కావ్యాల పోటీలు

కర్నూలు కల్చరల్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో తెలుగు పద్య, గేయ కావ్యాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు డాక్టర్ ప్రసాద్ తోటకూర తెలిపారు. సమకాలీన సామాజిక సమస్యలు - పరిష్కారాలు, మానవ సంబంధాలు - కుటుంబ విలువలు, ప్రకృతి - పర్యావరణం, యువతరం - భవిష్యత్తు, దేశభక్తి - జ ఆతీయ వాదం అంశాల్లో ఏదైనా ఒక అంశం తీసుకుని పద్య కావ్యం కానీ, గేయ కావ్యం కానీ 60 పేజీలకు మించ కుండా రాసి పంపాలని పేర్కొన్నారు. కావ్యాలను ఈనెల 31వ తేదీలోగా పంపాలని పేర్కొన్నారు. కావ్యం డీటీపీ ప్రతిని ఈ మెయిల్ రూపంలో naririve nne a@f-mai .com కానీ 97259 11208కు వాట్సాప్‌కు పంపవచ్చని తెలిపారు. మొదటి స్థానంలో నిలిచిన విజేతకు రూ.లక్ష నగదు పురస్కారం అందజేస్తామన్నారు.

అశోకా కళాశాలకు న్యాక్ ఏ+ గుర్తింపు

కల్లూరు: దూపాడు సమీపంలోని అశోకా మహిళ ఇంజినీరింగ్ కళాశాలకు న్యాక్ ఏ+ గుర్తింపు ఇచ్చిన్నట్లు చైర్మన్ అశోక వర్ధన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అధ్యాపకుల బృందాన్నికి ప్రత్యేకంగా అభినందించారు. కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

22న ఎల్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 22న ఉదయం 10 గంటలకు కర్నూలు మండలం వెంకాయపల్లె ఎల్లమ్మ దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ సీతారామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హుండీ లెక్కింపులో ఆలయ కమిటీ సభ్యులు, పూజారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కల్లూరు : ప్రమాదవశాత్తు మిద్దె నుంచి కింద పడి గాయపడి చికిత్స పొందుతున్న పుసులూరుకు చెందిన బోయ మధు(23) కోలుకోలేక మృతి చెందినట్లు ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప తెలిపారు. పుసులూరు గ్రామానికి చెందిన బోయ అయ్యస్వామి కుమారుడ బోయ మధు ఈ నెల 18న ఇంటి మిద్దెపై నిద్రస్తూ మధ్యరాత్రిలో మూత్ర విసర్జన చేస్తూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



గార్గేయపురం జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు

పాణ్యం : నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ దస్తగిరి అన్నారు. శనివారం గోరుకల్లు సచివాలయంలో లబ్ధిదారులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లబ్ధిదారులకు అన్ని విధాలుగా చేయూత అందిస్తోందన్నారు. పేదలందరికీ ఇల్లు కట్టించాలనే ఉద్దేశంతో సిమెంట్, ఇసుక, కడ్డీలు, ఉడ్, ఎలక్ట్రికల్ సామగ్రి, మరుగుదొడ్డికి సంబధించిన వస్తువులు అందిస్తున్నట్లు చెప్పారు. బిల్లులు కూడా సకాలంలో మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ప్రారంభించని వారు కూడా త్వరగా నిర్మాణాలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉసేన్‌సా, హౌసింగ్ ఏఈ నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

త్వరగా పూర్తి చేసుకోవాలి

కోడుమూరు రూరల్: జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులంతా ఈ నెలాఖరులోగా నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు సూచించారు. శనివారం మండలంలోని గోరంట్ల జగనన్న కాలనీని ఎంపీడీఓ చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

కల్లూరు : జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి ఎంపీడీఓ జీవీ రమణమూర్తి సూచించారు. శనివారం దొడ్డిపాడు గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్‌ను హౌసింగ్ ఏఈ రమణారెడ్డితో కలిసి పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం గార్గేయపురంలోని జగనన్న లే అవుట్‌లో నిర్మాణాలు వేగవంతం చేసి 15 రోజుల్లో రూఫ్‌లెవల్‌కు వరకు చేరేలా అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు, ఈఓ ఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి అసూచించారు. శనివారం గార్గేయపురంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులందరూ ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి త్వరితగతిన గృహ ప్రవేశాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కృష్ణమూర్తి, గార్గేయపురం మాజీ సర్పంచ్ ఏసేపు, సచివాలయ కన్వీనర్ సురేష్ పాల్గొన్నారు.

గూడూరు రూరల్ : మండల పరిధిలోని కె.నాగలాపురంలోని జగనన్న కాలనీలో లబ్ధిదారులు చేపట్టిన గృహ నిర్మాణాలను శనివారం ఎంపీడీఓ మాధవీలత, తహసీల్దార్ ఆంజనేయులు, హౌసింగ్ ఏఈ జమ్మన్న పరిశీలించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని సూచించారు.

సి.బెళగల్: హౌసింగ్ ఏఈ సుమంత్ శనివారం మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో పర్యటించి లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు.